# పునిస్త్రీ పునర్వివాహం

యల్లాప్రగడ సీతాకుమారి

"పిరకబడ్డకొద్దీ సంఘం మరీ తొక్కి పడుతుంది. రేపు నీకొచ్చే కష్టనష్టాల కేమన్నా ఈసంఘం బాధ్యతవహిస్తుందా?"

ఆ రోజుల్లో సుధా నేనూ కలిసి చదువుకుంటుండేవాళ్లం. సుధ మా క్లాసులోకల్లా చురుకైంది. చాలా మందిపిల్లలు స్నేహితంగాఉండీకూడా పోట్లాడుకుంటూ ఉంటారు. కాని నాకు జ్ఞాపకం ఉన్నంతవరకు సుధా, నేనూ ఎప్పుడూ పోట్లాడుకునే వాళ్లం గాదు.

ఆ యేడు నాకు పెళ్లిచెయ్యాలని నాన్నగారు చాలా ప్రయత్నాలు చేస్తున్నారు. పదమూడోఏడు వెళ్లకుండానే చెయ్యాలని అమ్మగోల. కాని ఏం లాభం? ఎక్కడికివెళ్లినా వేలమీదఉంది లెక్క. వెతగ్గా వెతగ్గా, తిరగ్గా తిరగ్గా హైదరాబాదులో ఒక సంబంధం కుదిరింది. విధుశేఖరం "డాక్టరుపరీక్ష"కు చదువుతున్నాడు. తండ్రికి పి. డబులు యు. డి. ఆఫీసులో పెద్ద ఎక్కౌంటెంటు పని. వేరే కొంతఆస్తికూడా ఉందిట. కట్నం రెండువేలు.

నాకు చాలా కష్టంవేసిం ది. ఏమంటే నాకు అవయవాల్లో కుంటీ, గుడ్డీ ఏమీ లేదు. ఇప్పుడు ఫోర్తుఫారం చదువుతూఉన్నాను. కొద్దిగా సంగీతం వచ్చును. ఇంటిపనులు కొన్ని చేతవును. ఏవిధంగానూ గృహానిర్వాహాణానికి అనర్హురాలినికానప్పుడు రెండు వేలు ఇస్తేనేగాని పెండ్లికాని కర్మం నా కెందు కొచ్చిందో తెలీదు. పైగా నాన్నగారు ఎలాగూ రెండువే లివ్వ లేనప్పుడు ఈ సంబంధం ఎందుకు కుదిర్చిందీగూడ తెలీదు.

సాయంకాలం సుధావాళ్లింటికి వెళ్లాను. మాటలసందర్భంలో సుధ "ఏం, ఇంకా మీవాళ్లు నీపెళ్లి ప్రయత్నంలోనే ఉన్నారా?" అని అడిగింది.

"ఆ. ఇప్పుడో సంబంధం కుదిరింది. కట్నం రెండువేలు."

"ఆఁ! అలాగా! మరి నీకిష్టమేనా?"

"నాకిష్టంలేదుగాని మావాళ్లకు నా ఇష్టంతో పనిలేదు."

"పోనీ, ఇప్పుడేంతొందరొచ్చింది, ఇంకా కొన్నాళ్లు చదువుకోరాదూ? అప్పుడు మూడుపాళ్లు కట్నాలేమీ ఇవ్వకుండానే సంబంధంకుదరవచ్చు."

"ఆఁ! అందరికీ మీనాన్నగారి లాటి ధైర్యం ఉండొద్దూ?"

"కాదు సుధా, పిరకబడ్డ కొద్ది సంఘం మరీ తొక్కిపడుతుంది. రేపు నీకొచ్చే కష్టనష్టా లేమన్నా ఈ సంఘం బాధ్యతవహిస్తుందా?"

ఆ రాత్రంతా సుధమాటలే నాతల్లో మెదులుతూ ఉన్నయి. ఒకసారి, మర్నాడు ఎలాగైనా నాకీ పెండ్లివద్దనీ, సుధలాగా ఇంకాకొంత కాలం చదువుకుంటాననీ మావాళ్లతో చెప్పవలెననుకున్నాను. కాని అంతలోనే మళ్లీ "ఏమో, తీరానిశ్చయమైన పెళ్లిమానేస్తారా?" అనిపించి చెప్పడానికి వెనక్కుతీశాను. సంఘాన్నెదిరించలేని మానాన్నగారి పిరికితనమే నాలోగూడ కనిపించిందేమో!

సరి. వివాహకాలం వచ్చింది, కట్నం ఇచ్చేసమయం వచ్చింది. నాన్నగారు విధు తండ్రిని లోపలికి తీసుకుపోయి "బావగారూ, సమయానికి డబ్బు తటస్థపడలేదు. ఇస్తా ఇస్తానని చెప్పి ఓ వెధవ సమయానికి ముఖం తప్పించాడు. ఇప్పుడైనా ముంచుకుపోయిందేమీ లేదు. ఎలాగూ మాపొలంలో కొంత దీనికింద అమ్మవలెననుకుంటున్నాము కనుక ఆ పొలం మీకే వ్రాసి ఇస్తాను. ఇప్పుడుమాత్రం శుభకార్యం జరుగనియ్యండి" అంటూ చెప్పారు. విధుతండ్రి తెలివైనవాడే కాని హైదరాబాదువాడు కనుక మా నిజస్థితి తెలియక ఈ విషయం లోమాత్రం బోల్తాపడ్డాడు. పెండ్లి సక్రమంగానే జరిగిపోయింది.

పెళ్లయినతరువాత నాన్నగారికేమీ ఆస్తిలేదనీ, తమనిమోసపుచ్చారనీ విధుతండ్రికి తెలిసిపోయింది. దానిలో ఆయనకు ఏదోపెద్దపరాభవం జరిగినట్లు ఎక్కడలేని కోపం వచ్చింది. అక్కడితో నాచరిత్రలో విషాదఘట్టం ప్రారంభం అయింది. ఇక వాళ్లెవరూ మాఊరు రావటం కాని, వీళ్లెవరు వెళ్లినా మాట్లాడ్డం గాని లేకుండా నిలిచిపోయినయి.

౨

ఒకరోజు సాయంకాలం సుధ మాఇంటికి వచ్చింది.

"ఏం సుధా, ఈ పరీక్షతో నీకు మెట్రిక్ అయిపోతుందిగదా, ఇకముందేమిచేస్తావు?"

నేను కొంచెం నిరుత్సాహంతో "ఏమో సుధా, ఇక మానివేస్తాను." అన్నాను. సుధ మామూలుగా కులాసాగానూ, ఉత్సాహంగానూ ఉన్నది కాని నాకుమాత్రం అప్పుడే ఈ నిరుత్సాహం ఎక్కడినుంచి వచ్చిందో! "ఐతే నీవేం చేస్తావు మరి?"

"హైదరాబాదులో మా మామయ్యగారి ఇంట్లో ఉండి మెడికల్ కోర్సు చదువుతాను."

"పెండ్లి విషయం ఏమన్నా ప్రయత్నిస్తున్నారా?"

"లేదు. ఇప్పుడైతే ఎంతలేదన్నా కాస్త మంచి సంబంధం కావాలంటే రెండు మూడు వేలన్నా కావాలి. ఆ డబ్బుపెట్టి చదువుకుంటే తర్వాత కట్నం లేకుండా సంబంధమూ వస్తుంది, నాకు చదువూ ఉంటుంది. అందుకని నాన్నగారు ఎలాగైనా కష్టపడి నాకు డాక్టరు చదువు చెప్పిస్తానంటున్నారు."

* * *

రెండేళ్లు గడిచిపోయినయి. నన్ను తీసికెళ్లమని నాన్నగారు ఎంతమంది చేత కబురుచేసినా 'కాలం ఇవ్వండి లాభంలేదని' విధుతండ్రి చెప్పుతూ వచ్చాడు. చివరకు ఒకరోజున మా నాన్నగారు నన్ను తీసుకొని హైదరాబాదు వెళ్లారు. కాని విధుతండ్రి మా నాన్నగారిని తీవ్రంగా దూషించి, మోసకారుల పిల్ల మాకు వద్దని మమ్మల్ని పంపివేశారు. నాకు మటుకు ప్రత్యేకంగా విధు ఉద్దేశం ఎలా ఉంటుందో కనుక్కోవలెనని పించిందిగాని, దురదృష్టం, విధు ఆరోజున ఊళ్లో లేడట. స్కూలుపిల్లలతో 'విహారం' (Excursion) వెళ్లాడట.

ఇక నేను శాశ్వతంగా పుట్టింట్లోనే ఉండవలసి వచ్చింది. ఈ రోజుల్లో, నాలాటి వ్యర్థజీవినుల కథలు ఏమైనా దొరకగానే వాళ్లేం చేసేవాళ్లోనని చదువుతూ ఉండేదాన్ని. అందులో చాలామంది రకరకాల విషాలు త్రాగి మరణిస్తుండేవాళ్లు. మరికొందరు దాసీలల్లే ఉంటామనీ, ఉండనిస్తేనే చాలనీ భర్తకు ఉత్తరాలు వ్రాస్తుండేవాళ్లు. కాని ఇవేవీ నాకు మంచి వనిపించలేదు. ఏమాత్రమూ ఇష్టంలేని విధుదగ్గర పడుస్తూపడిఉండేకంటె చనిపోవటమే నయమనే మోననిపించింది. కాని ఏవిషం తింటే నిర్బాధాకరంగా మరణిస్తానో తెలీదు. పైగా నా కావిషాలు ఎవరమ్ముతారు? పోనీ, నాటుపద్ధతులున్నాయి: చీర ముట్టించుకోనీ, నూతిలో పడీ మోస్తరు. అమ్మబాబో! ఛా. కాకపోయినా సమానంగా వ్యర్థజీవులమైన మా ఇద్దరిలో విధు హాయిగా కులాసాగా తిరుగుతూ చదువుకుంటూ ఉంటే నాకే చచ్చిపోయే కర్మం ఏంవచ్చిందీ?

కాని సంఘం! ఈ పక్షపాతపు గుడ్డిసంఘం విధు నేమీా అనడం లేదు కాని "ఫలానివారమ్మాయిని మగడు వదిలిపెట్టాట్ట, విన్నారా" అంటూ నన్నే చెప్పుకునేవాళ్లు. పోనియ్యి, ఈ సంఘంతో నాకేమి లెక్క? సుధ చెప్పినట్లు నా కష్టనష్టాలకే సంఘం ఏమన్నా పూచీపడుతుందా?

కాని నా స్థితికి ఇప్పుడు నాన్నగారు కూడా విచారించ సాగారు. అనవసరంగా తొందరపడి, ఎక్కువలకు పోయి, మోసంచేసి చేసిన నా వివాహం ఈ విధంగా ఫలించినందుకు చాలా క్రుంగిపోయినారు.

మరి రెండేళ్లయింది. ఇంతలో కొద్దిజీతాలవాళ్ల కొంపలు తీసే "రిట్రెంచిమెంటు" భయంకరాకారంతో వచ్చి పడ్డది. నాన్నగారింకా బాగా నౌకరీ చేయగలిగేఉన్నా, సర్వీసుఅయిపోయిందని పెన్షను పుచ్చుకోమన్నారు. కాని ఇదివరకు జీతమంతా వస్తేనే కష్టంగా జరుపుకొనే స్థితిలో ఈ సగంజీతంతో ఇల్లుగడవటం ఎంతో కష్టంగా ఉంది. ఇంతే కాక చేతికి వచ్చిన మగపిల్లలు కూడా లేరు.

ఎవరికయినా కష్టా లెక్కువవుతూన్న కొద్ది ధైర్యం, సాహసం ఎక్కువవుతాయి. అలాగే ఇప్పుడు నాకు కూడ ధైర్యంకలిగి, ఎలాగన్నా కష్టపడి వీళ్లను పోషించాలి అని నిశ్చయం చేసుకున్నాను.

ప్రయత్నంచేస్తే ఫలం ఉండక పోదు. మా ఊళ్లోనే బాలికాపాఠశాలలో ఒకటీచరుపని ఖాళీవచ్చింది. హిందూస్త్రీని కనుక నాకా ఉద్యోగం ఎక్కువప్రయాస లేకుండానే దొరికిపోయింది. గత్యంతరం లేక నాన్నగారేమీా అడ్డు చెప్పలేదు. ఇప్పుడు నాజీతం, నాన్నగారి పెన్షనూ కలుపుకొని హాయిగా జీవిస్తున్నాం.

వేసంకాలంలో సుధ వచ్చిందని తెలిసి ఒకరోజున చూడ్డానికి వెళ్లాను.

"ఏంసుధా, ఇంకా ఎన్నాళ్లుంది చదువు?"

సుధ ఉత్సాహంగా "ఇంకో ఏడా దైతే ఎం. బి. బి. ఎస్. డిగ్రీవస్తుంది."

"మధూ, నీకు తెలీదేమో, ఈ మధ్య నేను పెళ్లిచేసుకున్నాను." అని అంది.

"అదేమిటి, చదువు పూర్తయే దాకా చేసుకోనన్నావుగదూ? వరు డెవరు?"

"హైదరాబాదులోనే ఉంటాడు, విధుశేఖరం అని...."

నేను అదరిపడి "విధుశేఖరమా? ఏ విధుశేఖరం?" అన్నాను.

"లక్ష్మీప్రసాదంగారని, ఆయనకొడుకు. మా కాలేజీలోనే మెడికల్ కోర్సు చదువుతున్నాడు"

కొంచెం సర్దుకొని "అలాగా? కట్నంఏమైనాఇచ్చారా?"అన్నాను.

"లేదు. విధుతండ్రిమాత్రం కట్నమో అన్నాట్ట. కాని ఈ ఏడవగానే నాకేదో పెద్దనౌకరీ దొరుకుతుందని చెప్పేటప్పటికిన రేసనివప్పుకున్నాట్ట."

ఇక అక్కడ నిలవలేకపోయాను. "కొంచెం పనుంది సుధా, రేపు మళ్లీ వస్తాను."

"తప్పకుండావస్తావుకదూ?"

3

ఇంటికి పోయి గదిలో పడుకున్నాను. నాసర్వావయవాల్లోనుంచీ పొగలువస్తున్నట్టనిపించింది. "విధు పెళ్లిచేసుకున్నాడు. ఎవర్ని? సుధను. మరి నేనో? విధూ నావాడు ఎప్పుడూ కాలేదు. నేనూ అతనిదాన్ని కాలేదు. కాని మా కిద్దరికీ సంఘం ఓసంబంధం అంటగట్టింది. ఇప్పుడు విధు ఆ సంబంధాన్ని తెంచుకొని వేరే పెండ్లిచేసుకున్నాడు. నే నేంగావాలో ఆలోచించవన్నాలేదు. మరి దీనికి ప్రతిక్రియ ఏంచేస్తాను? ఎలాగన్నా, విధు వదలిపెట్టినాగాని నాకేమీనష్టం కలగలేదని అతనూ,అతనితండ్రీ తెలుసుకునేటట్లు చేస్తే నా ఆత్మతృప్తి పడి మనసు కుదుటబడుతుంది. కాని ఈ సంఘం మగవాళ్లకిచ్చిన అతి చనువువల్ల విధు గబుక్కున పెండ్లి చేసుకున్నాడు. మరి నేనో...

మర్నాడు సాయంత్రం సుధను కలుసుకున్నాను.

"సుధా, నీకు తెలీదేమో, నేను పెళ్లిచేసుకోబోతున్నాను."

"అదేమిటే, నీకు పెళ్లయింది కాదూ?"

"అవును, ఆ రేళ్లక్రింద. కాని నేను అతన్ని వదలివేశాను."

"వదలిపెట్టావా? ఎందుకని?"

"వినగలిగితే కంగారుపడకుండా విను. ఇప్పుడు నీభర్తఅయిన విధుశేఖరాన్నే నేను చేసుకున్నది. కాని మా నాన్నగారు ఇస్తానన్నకట్నం ఇవ్వలేకపోవటంచేత విధుతండ్రినన్ను వాళ్లఇంటికి రానివ్వలేదు."

"ఏమిటే, ఎంతపనిజరిగింది! విధుకు ఇదివరకే పెండ్లయినసంగతి నా కిదివరకు తెలియదు. ఇలా నన్ను మోసం చేసి పెళ్లిచేసుకున్నాడా విధు?"

"సుధా, ఐతే ఒకసంగతి నీవు విధునుపెళ్లిచేసుకున్నందుకు నాకేమీ కష్టంగా లేదు. ఏమంటే, ఎలాగూ అతనికీ నాకూ కలియదు. స్థితికిమించిన సంబంధాలకు పోతే ఎప్పుడూ ఇలాగే జరుగుతుంటుంది."

"కాని, మధూ, విధుమాత్రం చాలా మంచివాడు. అత నిలా చేస్తా డని నే ననుకోలేదు. కాని ఇందులో అతని తప్పెక్కువ ఉండ దనుకుంటాను. అంతా అతనితండ్రి కుట్ర అనుకుంటాను."

"కావచ్చును; కాని విధుకు నామీద ఇష్టం ఉంటే ఎలాగైనా



స్వతంత్రించి తీసుకు పోయేవాడే. ఇంతవరకూ అతనికొరకు నేనుగూడ ఎక్కువగా వాంఛించిందీ లేదు. హాయిగా ఇక్కడ టీచరుపని చేస్తూ స్వతంత్రంగా బతుకుతూఉన్నాను."

"మరి ఇప్పుడు నీ వెవర్ని పెళ్లి చేసుకోబోతున్నావు?"

"ఈ వూళ్లోనే మా పక్కఇంటి భగీరథాన్ని. అతను చాలా తెలివైనవాడూ, బుద్ధిమంతుడూ కూడాను. కాని తండ్రి ఇచ్చిపోయిన ఆస్తి ఏమీ లేకపోవడంచేత త్వరలోనే చదువు చాలించి ఈ వూళ్లోనే టీచరుగా ఉంటున్నాడు. అంచాత కట్నాలిచ్చే మంచిసంబంధాలేమీ దొరకడంలేదు. కనుక అతన్ని నేను చేసుకుంటే సరిపోతుంది."

"బాగానే ఉంది. కాని- కాని, మధూ, ఇప్పటి హిందూలా ప్రకారం, పేరుకుమాత్రమే నీకు భర్తఅయినా, విధు ఉండగా నీవు వివాహంచేసుకోడానికి వీలు లేదు."

నాకు వళ్లు మండిపోయింది. "వీలు లేదూ? పెళ్లిలోకూడా అతనిముఖం తిన్నగా చూళ్లేదు నేను. అలాంటి విధు శాశ్వతంగా నన్ను వదిలిపెట్టి వేరే పెళ్లిచేసుకొని సుఖపడుతూ ఉంటే నేను మాత్రం పెళ్లిచేసుకోడానికి వీల్లేదా? మరేం చెయ్యడానికి వీలుంటుందో??"

సుధ శాంతిగా "భరణంకోసం అతనిమీద దావా వెయ్యవచ్చును." అంది.

"అతనిడబ్బు నా కవసరంలేదు. డబ్బుకోసం నేను పెళ్లిచేసుకోలేదు. నాపొట్ట నేనుపోసుకొని ముసలివాళ్లయిన మా అమ్మనూ, నాన్నగారినీ గూడా పోషించుకోగలుగుతున్నాను. కాని-కాని, సుధా, నాకు తోడునీడగా ఉండడానికి, అతని కష్టసుఖాల్లో నేనూ - నా కష్టసుఖాల్లో అతనూ బాధ్యతవహించడానికి ఇప్పుడిప్పుడు నాకు పెళ్లి అవసరం అనిపిస్తున్నది. ఏం లాభం, నేను వితంతువుకంటె గూడ అధమం అయిపోయాను."

సుధ చాలాసేపు నిశ్శబ్దంగా ఆలోచించడం మొదలు పెట్టింది. ఆ ముఖంలో అనేకభావాలు కనుపించాయి. చివరకు ప్రశాంతంగా, "మధూ, నాకు తెలిసినంతమట్టుకు విధుశేఖరానికి నీ మీద ద్వేషం గాని, ఈర్ష్యకాని లేదనుకుంటాను. ఇంతే కాక స్నేహితురాలినైన నేనే నీ సౌఖ్యజీవనానికి అడ్డుపడ్డం మరీ హృదయవిదారకంగా ఉంది. ఏమైతేనేమి, జరిగిందేమో జరిగిపోయింది. ఇప్పుడైనా నీవు సంఘాన్నెదిరించి మళ్లీ పెళ్లిచేసుకుంటాననడం నాకెంతో ఆనందంగా ఉంది. ఈ శెలవల్లో ఇక్కడే గడుపుదామని విధుకూడ ఇవ్వాళో రేపో ఈ వూరొస్తాడు కనుక నే నెలాగైనా విధుదగ్గిరనుంచి నీకు వివాహానికి అనుజ్ఞాపత్రం తీసుకొని ఇస్తాను. అతను తప్పకుండా ఇస్తాడని నాకు నమ్మకం ఉంది." అంది.

సుధ ఔదార్యానికి నాకు చాలా తృప్తికలిగింది. "నీ ఆలోచన బాగానే ఉన్నది సుధా నేను మళ్లీ రేపు కలుస్తాను" అని ఇంటికి వచ్చాను.

౪

ఆ రాత్రి కూడ నా పని ఆలోచించడమే అయింది. "విధు అనుజ్ఞ ఇస్తే కాని నేను పెళ్లిచేసుకోకూడదా? ఎంత దురవస్థ! పోనీ, పెళ్లిమాని ఇలాగే ఉంటే? ఏం లాభం, ఏం గొప్ప? అలాటివాళ్లెంతమందో ఆంధ్రదేశంలో! వాళ్లల్లో నేనూ ఒకదాన్ని. ఇప్పటికి ఎలాగో ఈ అనుజ్ఞతోనే పెళ్లి చేసుకుంటే సంఘానికి ఒక ఆదర్శం చూపించినదాన్నవుతానేమో". రెండురోజుల ఆలోచనా ఫలితంగా ఈ నిశ్చయానికి రాగలిగాను. కాని అప్పుడే నాలో ఈ శపథంకూడా చేసుకున్నాను "ఎలాగైనా ప్రయత్నించి నా జన్మలో స్త్రీలకు గూడ భర్త ఉండగానే పునర్వివాహాధికారం వచ్చేటట్లు చెయ్యాలని, లేదా పురుషులకే ఆ అధికారం తీసివేయించాలని."

రెండురోజుల తర్వాత సుధను కలుసుకున్నాను. సుధ ఉత్సాహంతోనూ, ఆనందంతోనూ బయటికి వచ్చి నన్ను లోపలికి తీసుకువెళ్లింది.

నేనూ సుధా హాల్లో కూచొని మాట్లాడుతూ ఉండగా లోపలినుంచి విధుశేఖరంవచ్చి, నన్ను చూడగానే మందహాసంతో హైదరాబాదు పద్ధతిగా "నమస్కారం" అంటూ వేరొక కుర్చీలో కూర్చున్నాడు. నాకు అతని ప్రవర్తనకు ఆశ్చర్యం వేసింది. ఇప్పుడు విరోధంగా మాట్లాడాలో, స్నేహంగా మాట్లాడాలో గూడ తెలీలేదు. అంతలో అతనే ముందుగా మాట్లాడ్డం మొదలెట్టాడు. "మీ విషయంలో చాలా పొరపాటు జరిగింది. ఈమధ్య మీసంగతే నాకు తెలియలేదు."

ఏమనాలో తెలీక "అలాగా" అన్నాను.

ఇంతలో సుధ అందుకొని "చూచావా, మధూ, వాళ్ల నాన్నగారు తప్పంతా మీ దేనన్నారుట!"

ఆశ్చర్యంతో "ఎలా" అన్నాను.

విధు అందుకొని "ఎన్నిసార్లు పిల్లను పంపమని కబురు చేసినా నిన్ను పంపలేదని, ఇన్నాళ్ళకిట్లాం ఇవ్వకపోగా పిల్లనుగూడ పంపటం లేదని చెప్పి నన్ను వేరేపెళ్లి చేసుకో మన్నారు" అన్నాడు. నేను కొంచెం గొంతు సవరించుకొని "సరిగానే ఉంది. మా నాన్నగారిమీద ఆయన కసి తీర్చుకున్నారు" అన్నాను. సుధ అందుకొని, "కాని, మధూ, నీమీద కసితీర్చుకోవలెననే ఉద్దేశ్యం విధుకేమీ లేదు. నిన్న నేను చెప్పగానే అనుజ్ఞాపత్రం వ్రాసిఇచ్చారు" అంది.

విధు చిరునవ్వుతో "ఇందులో మాలాభం కూడ కొంత ఉంది" అన్నాడు.

"ఏమి టది?"

"నీవు వేరేపెళ్లి చేసుకుంటే నామూలాన ఒకస్త్రీ జీవితం పాడయిపోయిందనే విచారం నాకుండదు. మనోవర్తి ఇవ్వవలసి వచ్చిందనేకష్టం మానాన్నగారికి ఉండదు."

లోపలినుంచి 'టీ' వచ్చింది. అందరం టీ తీసుకుంటూ "సుధా, సాధ్యమైనంతత్వరగా బహుశా, పై వారంలోనే చేసుకుంటాను. తప్పకుండా వస్తావుకాదూ?" అంటూ విధువైపు తిరిగి "ఇక్కడే ఉంటారు కనుక మీరుగూడ సుధతోటి ఆ వేళకు..."

"ఓ, తప్పకుండా."

సుధదగ్గిరనుంచి అనుజ్ఞాపత్రం తీసుకొని వెళ్లిపోయినాను.

౫

భగీరథంతో నావివాహం సక్రమంగాజరిగిపోయింది. ఇంట్లో ఎవరూ అడ్డు చెప్పలేదు. మా ఆదర్శవివాహాన్ని ప్రకటిస్తూ పత్రికలన్నీ నన్ను "పునిస్త్రీ పునర్వివాహాన్ని వెలువరించిన ప్రథమాంధ్రస్త్రీ" నంటూ పొగుడుతూ వ్రాశాయి.



"ఇక్కడే ఉంటారు కనుక మీరు గూడ సుధతోటి ఆ..."